W W W.EPAPER.MAHADAILY.COM

మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

28-6-2025





06

## ఆపరేషన్ ముస్కాన్-11 విజయవంతం చేయాలి

### పోలీస్ కమిషనర్ సునీల్ దత్

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్-11 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అధికారులకు ఆదేశించారు.



08

## ఆదివాసులకు న్యాయం చేస్తున్నా

### మంత్రి సీతక్క

జీవో నెంబర్ 49 రద్దు అంశంపై మంత్రి సీతక్కకు మావోయిస్టుల పేరిట వచ్చిన హెచ్చరిక లేఖపై ఆమె స్పష్టమైన స్పందన వ్యక్తం చేశారు. ఈ లేఖ నిజంగా మావోయిస్టు పార్టీ నుంచి వచ్చిందా, లేదో స్పష్టత లేదని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. అయినప్పటికీ, ఈ లేఖను ఆధారంగా చేసుకొని కొన్ని రాజకీయ పార్టీలు, పత్రికలు, మీడియా సంస్థలు అసత్య ప్రచారాలను నిర్వహిస్తున్నాయని మండిపడ్డారు.



08

## రేడియాలజీ లేకుండానే రిపోర్టు

### ల్యాబ్‌లలో ప్రాణాలతో చెలగాటం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డయాగ్నస్టిక్, స్కానింగ్, రేడియాలజీ ల్యాబ్‌లలో సాగుతున్న రోగ నిర్ధారణ పద్ధతులు, అధికారుల నిర్లక్ష్యం, ప్రైవేటు ఆసుపత్రుల ఆధిపత్యం అన్నీ కలసి ప్రజారోగ్యం మీద విపరీతమైన ప్రభావాన్ని చూపిస్తున్నాయి. నిపుణులేమీ లేకుండా, సరైన పరికరాలేమీ లేకుండా, అనుభవం లేని సిబ్బందితో కేవలం లాభాల కోసం రోగుల జీవితాలను ముప్పులోకి నెట్టడం అత్యంత ప్రమాదకరమైన ప్రక్రియగా మారింది.



07

ఖమ్మం, మహా

# నకిలీ విత్తనాలకు చెక్

## రైతుకు నమ్మకంగా విత్తనం అందించే చట్టం

- చిన్న రైతుకు పెద్ద భరోసా - కొత్త విత్తన చట్టం
- విత్తనాలపై నియంత్రణకు కొత్త దారులు

రైతు చేతుల్లోకి చేరే విత్తనం... పంటల కన్నా ముం దుగా ఆశలు నాటుతుంది. ఆ ఆశలు నకిలీ విత్తనాల వలన చిగురించక ముందే మురిజేతలు కావడం, తెల్లదో సిల్లా మిగిలిపోయిన పొలాలు చూసి రైతు గుండె కదలికలు ఆగిపో తున్న దుస్థితి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తెలం గాణ ప్రభుత్వం కొత్త చట్టానికి శ్రీకారం చుట్టింది. నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపుతోంది.

### ఈ చట్టం అమలులోకి వచ్చినపుడు...

ఈ చట్టం అమలులోకి వచ్చినపుడు విత్తనాల నాణ్యతపై స్పష్టమైన ప్రమాణాలు అమలవుతాయి. విత్తనాన్ని ఉత్పత్తి చేసే కంపెనీలకు పూర్వానుమతి తప్పనిసరిగా ఉండాలి. రైతులకు నష్టమొచ్చే విధంగా విత్తనాల సరఫరా జరిగితే, కంపెనీలపై నేర చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి కలుగుతుంది. అంతేకాదు, రైతు నష్టానికి పరిహారం పొందే హక్కు కూడా చట్టం ద్వారా నిర్ధారించ బడుతుంది. తద్వారా న్యాయ పరిరక్షణ రైతు పక్షాన నిలబడుతుంది.

### రైతు నమ్మకాన్ని పునఃస్థాపించే పునాది



ఈ చట్టం కేవలం నియంత్రణకు మాత్రమే కాకుండా, రైతు నమ్మకాన్ని పునఃస్థాపించే పునాది కావాలనే లక్ష్యంతో ముందుకెళ్తోంది. రైతు చేతిలోకి వచ్చే విత్తనం, న్యాయబద్ధమైనదే అనే నమ్మకాన్ని చట్టబద్ధంగా నెలకొల్పే ప్రయత్నం ఇది. ఒక్కో విత్తనం ఒక్కో ఆశగా మారి, పంటలతో పాటు రైతు గుండె చప్పుడుని కూడా నిలబెట్టే చట్టంగా ఇది రూపుదిద్దుకుంటోంది.



# నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

## విత్తన దుకాణాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు

## పీడీ యాక్ట్‌తో కఠిన చర్యలు తప్పవు : సీఐ నాగరాజు రెడ్డి

**అశ్వారావుపేట, మహా:** ఖరీఫ్ సాగు సీజన్ ఉధృతంగా కొనసాగుతున్న నేపథ్యంలో రైతుల శ్రమను మోసం చేసే నకిలీ విత్తనాల ముఠాలపై ఉక్కుపాదం మోపేందుకు పోలీస్ శాఖ రంగంలోకి దిగింది. శుక్రవారం అశ్వారావుపేట మండలంలోని వినాయ కపురం గ్రామంలో సిరి ఫెర్టిలైజర్స్ మరియు రైతు మిత్ర సీడ్స్ పెస్టిసైడ్స్ విత్తన దుకాణాల్లో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిం చారు. విత్తనాల నిల్వల రిజిస్టర్లు, అమ్మకాల రికార్డులు, లైసెన్సులు, ధరల వివరాలను సుదీర్ఘంగా పరిశీలించారు. అనుమానాస్పద అంశాలపై నిర్వాహకులను అడిగి విచారణ చేశారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట సీఐ నాగరాజు రెడ్డి స్పష్టంగా హెచ్చరించారు. రైతుల ఆశలతో చెలగాటం ఆడే వారిని ఏమాత్రం వదిలిపెట్టం. వ్యవసాయ శాఖ నిబంధనలు పాటించకపోతే, నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. రైతుల కోసం శ్రద్ధగా పనిచేస్తున్నాం అని తెలిపారు. ఈ తనిఖీల్లో పీఎస్ఐ అఖిల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రోమోర్‌లో రైతులకు అన్ని రకాల సేవలు

**కారేపల్లి, మహా :** రైతులకు గ్రోమోర్ సెంటర్‌లో అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంచినట్లు ఆసంస్థ తెలంగాణ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం కారేపల్లి మన గ్రోమోర్ స్టోర్‌ను రైతులతో ప్రారంభింపచేశారు. ఈసందర్భంగా మనగ్రోమోర్ మేనేజర్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలు మన గ్రోమోర్‌లో లభిస్తాయన్నారు. కోనుగోలు చేసిన ప్రతి వస్తువుకు భీమా సౌకర్యం ఉంటుందన్నారు. రైతులు పంటలకు మందులను పిచికారి



చేసేందుస్త్ర డ్రోన్ పరికరాలను అందుబాటులో ఉంచామన్నారు. ఎకరాకు రూ.400 చెల్లించి డ్రోన్‌తో పురుగుమందులను పిచికారి చేసుకోవచ్చన్నారు. గ్రోమోర్‌లో కొనుగోలు చేసిన వస్తువులను 30 కిలోమీటర్ల పరిధిలో ఉచితంగా డెలివరి చేస్తామన్నారు. రైతులు భూసార పరీక్షలు చేసుకునేందరు అవకాశం సైతం కల్పించామన్నారు. మన గ్రోమోర్ స్టోర్‌ను రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మాజీ రైతు బంధు కన్వీనర్ హన్మకొండ రమేష్, సోసైటీ మాజీ డ్కెరక్టర్ అడపా పుల్లారావు, గ్రోమోర్ ఏరియా రీజనల్ మేనేజర్ సంతోష్ కుమార్, స్టోర్ మేనేజర్ మహేష్, ఆర్ఎసి జనార్ధన్, రైతులు,స్థానిక వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల హక్కుల సాధన కోసం ఉద్యమించాలి



**నేలకొండపల్లి, జూన్ 27 మహా:** దివ్యాంగుల హక్కుల సాధన కోసం క్షేత్ర స్థాయి లో ఉద్యమిం చాలని భారత తెలంగాణ దివ్యాంగుల సమితి, టీడీ జేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య పిలుపునిచ్చారు. మండలం లోని పైనంపల్లి లో శుక్రవారం దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... దివ్యాంగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పై ఉద్యమాలకు సిద్ధం కావాలని సూచించారు. గతంలో సంఘం చేసిన ఆందోళనలు స్ఫూర్తిదాయకం అన్నారు. ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకంలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని పార్టీలు దివ్యాంగులకు సీట్లు కేటాయించాలని కోరారు. మండల కేంద్రం పోరాడి కార్యాలయం నిర్మాణం కోరకు స్థలం సాధించామని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో భవనం నిర్మాణం కోరకు సమిష్టిగా కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు, సంఘం జేఏసీ నాయకులు రామకృష్ణ, చారీ, వెంకటేశ్వర్లు, సైదా, బ్రహ్మం, సఫియా, రాము, భద్రయ్య, వెంకన్న, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలలో మరోమారు పట్టు సాధించాలి



**నేలకొండపల్లి, జూన్ 27 మహా:** స్థానిక సంస్థల ఎన్నికలలో నేలకొండపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ తో పాటు, ఎంపీటీసీ స్థానాలను కాంగ్రెస్ మరో మారు విజయం సాధించి పట్టు సాధించాలని సోసైటీ చైర్మన్ గూడవల్లి రాంబ్రహ్మం సూచించారు. మండల కేంద్రంలో మంత్రి క్యాంపు కార్యాలయం లో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు...నేలకొండపల్లి మేజర్ పంచాయతీ కాంగ్రెస్ కు కంచుకోట అన్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి చేసిన అభివృద్ధి పనులను ఇంటింటా తిరిగి వివరించాలని సూచించారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ పాటు, మూడు ఎంపీటీసీలు భారీ మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్ధులు విజయం సాధించేలా పని చేయాలని సూచించారు. ప్రతీ కార్యకర్త –సైనికుల్లా ముందుకు సాగాలని సూచించారు. ఇక నుంచి ప్రతీ రోజుకాంగ్రెస్ పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. వార్డుల వారీగా ముఖ్యులతో సమావేశం నిర్వహించి, ఎన్నికలకు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ గుడిపాటి ముక్కంటి, పార్టీ నాయకులు గుండా బ్రహ్మం, వీరభద్రం, కైలాసపు వెంకటేశ్వర్లు, రాంబాబు, రాయపూడి శ్రీనివాసరావు, తోట వాసు, గోవింద్, పొన్నగాని రాంభాస్కర్, కడియాల నరేష్, కొండలు, వెంకటేశ్వర్లు, బొబ్బూరి శ్రీనివాసరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి



**భద్రాద్రి కొత్తగూడెం, (మహా):** సింగరేణి ఓసి ప్రభావిత ప్రాంతాల్లో యువతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి మధు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పెనగడప గ్రామంలో సిఐటియు ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో మధు పాల్గొని మాట్లాడుతూ, త్వరలోనే సింగరేణి ఓపెన్ కాస్ట్ లో బొగ్గు ఉత్పత్తి చేయడానికి సౌదా అనే కంపెనీ రాబోతుందని ఈ కంపెనీలో సింగరేణి ప్రభావిత ప్రాంతాల యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇదే ఓసి నందు వివిధ కంపెనీలలో గతంలో పనిచేసిన కాంట్రాక్టు కార్మికులకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందరికీ న్యాయం చేశాకనే, మిగతా యువతకు ఉద్యోగం కల్పించాలని అన్నారు. స్తానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వకుండా, దరఖాస్తుల పేరుతో వేరే ప్రాంతాల యువతను ఆకర్షించి లోపాయికరి ఒప్పందాలు చేసుకొని డబ్బులను సొమ్ము చేసుకునే పని చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇటువంటి భ్రమలో లో కల్పించే కంపెనీ ప్రకటనలు నమ్మొద్దని యువతకు పిలుపునిచ్చారు . యువకులకు ఉద్యోగాలి ఇప్పిస్తామని పేరుతో అడ్డదారులు తొక్కేందుకు అక్రమాలు చేసే వ్యక్తులను నమ్మొద్దని ఆయన అన్నారు. అక్రమాలకు పాల్పడే వ్యక్తులు తమరికి మోసం చేస్తే సిఐటియు సంఘ నాయకులకు దృష్టికి తీసుకురావాలని వారు కోరారు.

# లేబరు కోడ్స్‌ను రద్దు చేయాలి

## జులై 9 సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

### సిఐటియు జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు

**నేలకొండపల్లి, మహా:** కార్మికుల జీవితాలను, వారి భవిష్యత్తును నిర్వీర్యం చేసే నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, అంగన్వాడి యూనియన్ జిల్లా నాయకురాలు బి కోటేశ్వరి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9న జాతీయ కార్మిక సంఘాలు, స్కీం వర్కర్స్, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కు వివిధ శాఖల అధికారులకు సమ్మె నోటీసు అందించి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గ వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ కార్పోరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందని విమర్శించారు. అనేక ఏళ్లుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను హక్కులను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు కార్మికుల జీవితాలను ఫణంగా పెట్టిందని మండిపడ్డారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా బిజెపి



పాలిత రాష్ట్రాల్లో కార్మికుల పని గంటల విధానాన్ని 8 గంటల నుండి 10 గంటల వరకు పెంచి శ్రమదోపిడి చేస్తున్నారన్నారు. దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న చట్టాలను, హక్కులను, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక నిరంకుశ విధానాలను నిరసిస్తూ జులై 9వ తేదీన దేశవ్యాప్తంగా కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు, కూలీలు, రైతులు అన్ని వర్గాల ప్రజానీకం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చెరుకు శ్రీను, చల్లగుండ్ల నాగయ్య, బి ఆంజనేయులు, ప్రకాష్ బాబు, బొడ్డు పుల్లయ్య, స్టాలిన్, భాస్కర్ పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటుకు విరాళం అందజేత



**నేలకొండపల్లి, జూన్ 27 మహా:** నేలకొండపల్లి మండల పరిధిలోని చెన్నారం గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడానికి గాను అదే గ్రామానికి చెందిన ప్రజావేదిక డైలి పేపర్ సిఇఓ గంజికుంట్ల వెంకన్న రూ 25 వేల రూపాయలను నేలకొండపల్లి ఎస్సై పి. సంతోష్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ. సిసి కెమెరాలు గ్రామంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అపరిచితుల కదలికలను గుర్తించడానికి దోహదపడతాయన్నారు. ఏదైనా నేరం జరిగినప్పుడు నిందితులను గుర్తించడానికి సిసి కెమెరాలను ఎంతోగానోఉపయోగపడతాయన్నారు. చాలా నేరాల్లో నింధితులు దోషులుగా రుజువు కావడానికి సీసీ కెమెరాల సాక్ష్యం ఎంతగానో ఉపయోగపడిందన్నారు.. సీసీ కెమెరాల వల్ల నేరాలు జరుగకుండా నియత్రించినట్లయితే ఇంకా ప్రజలు అప్రమత్తంగా ఉండడానికి ఉపకరిస్తుంధన్నారు ప్రజల పోలీసుల మధ్య సమన్వయంతో నేరాలు సాధ్యపడుతుందని ఎస్సై తెలిపారు. సీసీ కెమెరాల సాక్ష్యం కోర్టులో చాలా ముఖ్యమని నింధితులు తప్పించుకునే అవకాశం ఉండదని చెప్పారు. ప్రజలకు సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ కల్పించినట్లు తెలియజేసారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది కానిస్టేబుళ్లతో సమానమని, 24 గంటలు 365 రోజులు నిర్విరామంగా నిరంతరాయంగా సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా గంజికుంట్ల వెంకన్న ను ఎస్సై సంతోష్ తో పాటు గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఎస్కే ఖాసీం, చెన్నారం పిఏసిఎస్ చైర్మన్ చింతనిప్పు సైదులు, చెన్నారం మాజీ సర్పంచ్ ఎస్కే మస్తాన్ పాల్గొన్నారు.

## గిరిజన యువతకు వెల్డింగ్ మెషిన్స్ అందజేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** స్పెషల్ సెంట్రల్ అసిస్టెంట్ స్కీం ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఐటిఐ కళాశాలలో పలు వృత్తులలో నైపుణ్యం సాధించిన యువకులకు వెల్డింగ్ మెషిన్స్, టూల్ కిట్స్ ను శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తమ చేతులు మీదుగా అందజేశారు. మొత్తం 10 యూనిట్లను అందజేయడం జరిగింది. ఒక్కో యూనిట్ ధర 55 వేల రూపాయలని తెలిపారు. ఐ.టి.ఐ.కాలేజీ, రుద్రంపూర్ నందు వెల్డింగ్ వర్క్ షాప్ లో స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ స్కీమ్ (ఎస్ ఎస్ ఎ) ద్వారా గత నెలలో  కాట్స్, చైర్స్ మరియు టేబుల్స్ (ఫర్నిచర్) ను వెల్డింగ్ వృత్తిలో నైపుణ్యం పొందిన గిరిజన యువతతో తయారు చేయించడం జరిగిందని, కళాశాల యాజమాన్యం మరియు అధికారులు ఎస్పీకి వివరించారు. ఆ ఫర్నిచర్ ను బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ కు,వెల్డింగ్ మిషన్స్ మరియు టూల్ కిట్స్ ను వెల్డింగ్ ట్రైనీస్ కు  అందచేసారు. అనంతరం ఐటిఐ కళాశాల నందు గల మెకానికల్, ఎలక్ట్రికల్, ఫిట్టర్ మరియు తదితర విభాగాలను ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుండే సరైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని క్రమశిక్షణతో మెలిగితే జీవితంలో విజయం సాధిస్తారని సూచించారు. ఎలాంటి చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా, మంచి స్నేహితులను ఏర్పరుచుకుని తాము నిర్దేశించుకున్న గమ్యం వైపు అడుగులు వేయాలని తెలిపారు.వృత్తి నైపుణ్యంతో జీవితంలో విజయం సాధించి ఎంతో మందికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. జిల్లాలోని ఆదివాసీ,గిరిజన యువత అభివృద్ధి వరకూ పోలీస్ శాఖ కూడా అన్ని రకాలుగా కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ బి సి వెల్ఫేర్ ఆఫీసర్ ఇందిరా, కొత్తగూడెం డీస్పీ రెహమాన్ , ఐ.టి.ఐ కాలేజీ ప్రిన్సిపాల్, డి ఆర్ డి ఎ  డి పి ఎం వెంకయ్య, ఐ.టీ.ఐ కాలేజీ స్టాఫ్ మరియు వెల్డింగ్ ట్రైనీస్ పాల్గొన్నారు.

## కారేపల్లి పెద్దచెరువులో అక్రమ తవ్వకాలపై పిర్యాదు



**కారేపల్లి, మహా :** కారేపల్లి పెద్ద చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతుండటంతో గ్రామస్తులు అధికారులతోపాటు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌కు పిర్యాదు చేశారు. అధికారుల అనుమతులు లేకుండానే మట్టి మాఫియా మాఫియా ఇష్టానుసారంగా చెరువులో తవ్వకాలు చేపడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులో మట్టి తవ్వకాలు చేపట్టద్దని మత్స్యకార సొసైటీ సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఫోన్‌లో వివరించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ నీటిపారుదల శాఖతోపాటు రెవెన్యూ అధికారులతో మాట్లాడి అనుమతులు లేకుండా చేపడుతున్న మట్టి త్రవ్వకాలను వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. దీంతో రెవెన్యూ సిబ్బంది అక్కడికి చేరుకొని తవ్వకాలను నిలిపివేశారు.

# 30న పూసుగూడెం వద్ద బీఆర్ఎస్ నిరసన

**సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రికు మొదట సాగునీరు అందించాలి**

**ఆ తర్వాతే ఇతర ప్రాంతాలకు తరలించాలి**

- **సీతారామ సాగునీటిని సాధించేవరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం**
- **కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి**



**భద్రాద్రి, కొత్తగూడెం మహా:** సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి జిల్లాకు సాగునీరు అందించకుండా పక్క జిల్లాలకు తరలించడం సరికాదని కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. ముందుగా భద్రాద్రి జిల్లాకు సాగునీరు అందించాకే ఇతర ప్రాంతాలకు తరలించాలని ప్రభుత్వానికి సూచనలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశాలతో.. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు సూచనల మేరకు ఈనెల 30న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద జరిగే కాంగ్రెస్ ప్రభుత్వ పింద ప్రధాన కార్యక్రమాన్ని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఇన్చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భద్రాద్రి జిల్లా రైతాంగం పై దృష్టి సారించాలని కోరారు. ఇటీవల ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద హెలికాప్టర్ లో వచ్చి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి హంగు ఆర్భాటంతో ఈ ప్రాజెక్టును ప్రారంభించారని గుర్తు చేశారు. కానీ ఇప్పటివరకు సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాలో ఏ ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందలేదన్నారు. ఇది చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వానికి నిదర్శనం అని, ఎక్కడైతే ఈ చేతకాని ముఖ్యమంత్రి ప్రాజెక్టును ప్రారంభించారో .. అక్కడే ఈనెల 30న ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ ప్రభుత్వానికి పిండప్రదానం చేయాల్సిందిగా జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు గారు పిలుపునిచ్చారు. ప్రభుత్వం మొండి వైఖరిని కొనసాగిస్తే జిల్లా రైతుల పక్షాన దశలవారీగా ఉద్యమాలు నిర్వహిస్తుందని హెచ్చరించారు. ఈనెల 30న ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి కోరారు.

# సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నేతలు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** వచ్చేజూలై 9 న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె లో సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్టు కార్మికులు పాల్గొంటారని, ముందుగానే చట్ట ప్రకారం తమ ద్వారా సింగరేణి యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇస్తున్నామని జిఎం పర్సనల్ కవితా నాయుడుకి సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులు కాలరాసే విధంగా నాలుగు లేబర్ కోడ్ లు తీసుకొచ్చాఎన్నారని అన్నారు. అనేక సంవత్సరాల చరిత్ర కలిగి, కార్మికుల సంక్షేమ కోసం ఏర్పడిన 29 కార్మిక



చట్టాలను రద్దు చేస్తూ అన్యాయంగా కార్మికులను మోసం చేసే విధానాలను వ్యతిరేకిస్తూ భారతదేశ వ్యాప్తంగా కార్మిక వర్గం ఒక్కరోజు సమ్మెకు పిలుపునిచ్చారని వారు తెలిపారు. కార్మిక వర్గానికి వ్యతిరేకంగా పాలన చేస్తున్న ప్రజా వ్యతిరేక బిజెపి విధానాలు అడ్డుకట్ట వేస్తూ జాతీయ కార్మిక సంఘాలు అన్ని ఐక్యంగా ఉద్యమిస్తున్నాయని తెలిపారు. సింగరేణి యాజమాన్యం కార్మిక సంక్షేమం కోసం ఆలోచించి సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి మధు ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు ఎస్.కె షేక్ షా వలి తెలంగాణ జన సమితి కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మల్లెల రామనాథం కాంట్రాక్టు కార్మిక హక్కుల పోరాట సమితి నాయకులు కరుణాకర్ సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియు కొత్తగూడెం బ్రాంచ్ నాయకులు భూక్యా రమేష్, గుగులోత సక్రం తదితరులు పాల్గొన్నారు

# జూలై 12 లోపు నైపుణ్య శిక్షణ కోసం ఎంబీసి నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి

**ఖమ్మం, మహా:** జూలై 12 లోపు నైపుణ్య శిక్షణ కోసం ఆసక్తి , అర్హత గల ఎంబీసి నిరుద్యోగ యువతి, యువకులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసి అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి శుక్రవారం తెలిపారు. అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంబీసీ నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ నైపుణ్య శిక్షణ కార్యక్రమం (4) రోజుల పాటు హైదరాబాద్ లో అందించడం జరుగు తుందని, శిక్షణ సమయంలో అభ్యర్థులకు భోజన సదుపాయం, ట్రావెలింగ్ అలవెన్సు, వసతి కల్పించడం జరుగుతుందని అన్నారు. అభ్యర్థులకు 21 నుంచి 30 సంవత్సరాల వరకు వయస్సు ఉండాలని, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలని, ఎంబిసి 36 కులాల వారికి మాత్రమే ఈ శిక్షణా కార్యక్రమం ఇవ్వనున్నట్లు, వీరి వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో లక్షన్నర, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షల వరకు ఉండాలని అన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను జూలై 12 లోపు tgobmms.cgg.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు ఫారానికి ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రం, విద్యార్హత సర్టిఫికెట్లను జత చేసి ఖమ్మం కలెక్టరేట్ లో ఉన్న బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో జూలై 14 లోపు సమర్పించాలని, నిరుద్యోగ ఎంబీసీ యువతీ, యువకులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసి అభివృద్ధి అధికారిణి పేర్కొన్నారు.

# సీపీఐ(ఎం) సానుభూతిపరురాలు మోకళ్ళ లక్ష్మి మృతి



**కారేపల్లి, మహా:** సీపీఐ(ఎం) సానుభూతిపరురాలు కారేపల్లి మండలం, బాజుమల్లాయిగూడెంకు చెందిన మోకాళ్ళ లక్ష్మి(62) శుక్రవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మి ఆరోగ్యం విషమించి మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర, డివిజన్ కమిటీ సభ్యులు వజ్జా రామారావు సందర్శించి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కడవరకు ఎర్రజెండాను వీడక పార్టీ పోరాటాలలో పాలుపంచుకుందన్నారు. ఆమె మృతి కుటుంబానికి, పార్టీకి తీరని లోటన్నారు. నివాళ్లు అర్పించిన వారిలో సీపీఐ(ఎం) నాయకులు మన్నెం బ్రహ్మయ్య, మద్దెలనాగయ్య, అజ్మీర శోభన్‌బాబు, వల్లబోయిన కొండలరావు, పోతురాజు చందర్‌రావు, మెరుగు రాములు, ఎస్‌కె.చిన్నసైదులు, మోకాళ్ళ రాములు, కోటేశ్వరరావు, లక్ష్మన్‌రావు, రామారావు, శేరు లలితమ్మ, ఎర్రబోడు మాజీ సర్పంచ్ కుర్సం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యాధికారికి హెల్త్‌వర్కర్ల సమ్మెనోటీస్



**కారేపల్లి, మహా :** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, కార్మిక చట్టాలను పునరుద్దించాలని డిమాండ్ చేస్తూ జూల్కె 9న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గంటున్నట్లు ఆశా వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కారేపల్లి మండల వైద్యాదికారి డాక్టర్ బీ.సురేష్‌కు సమ్మెనోటీస్ అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తీసుకరావటంతో కార్మికులకు ఉద్యోగ భద్రత కరువుతుందని, పని గంటలు పెరిగి వెట్టి ముందుకు వస్తుందన్నారు. స్కీమ్ వర్కర్లు అయిన ఆశాలకు స్థిరమైన కనీస వేతనం నిర్ణయించకుండా మోసం చేస్తుందన్నారు.దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయటం ద్వారా కార్మిక శక్తి చాటుదామన్నారు. ఈకార్యక్రమంలో హెల్త్ వర్కర్ యూనియన్ జిల్లా నాయకులు ఎల్లెబోయిన రాధ, మండల అధ్యక్షకార్యదర్శులు వాంకుడోత్ కమల, జంగ కళ్యాణి, నాయకురాళ్లు సీహెచ్.పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# మమతకు నివాళులర్పించిన నాయకులు

**కారేపల్లి, మహా:** మండల పరిధిలోని అప్పయిగూడెం పంచాయితీకి కాంగ్రెస్ నాయకులు పులసం భద్రయ్య సతీమణి పులసం మమత(42) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ అజ్మీర అరుణ, నాయకులు అజ్మీర విరన్న, సొసైటీ డైరెక్టర్ బాణోత్ హిరలాల్ లు మమత పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం మాజీ సర్పంచ్ అంతక్రియలకు 5వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈకార్యక్రమంలో నాయకులు అజ్మీర బిచ్చ, మాజీ ఎంపీటీసీ వాంకుడొత్ సుక్య, భూక్యా రాంకి, నందియా నాయక్,దరావత్ దేవీలాల్,గుగులోత్ మోహన్,రమేష్ , వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య ,కృష్ణ, నాగేంద్రబాబు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహా పత్రిక
ANN తెలుగు

# చంద్రుగొండ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 27 (మహా):** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం చంద్రుగొండ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ ఇంద్రాసేనారెడ్డి,ఎస్సై శివరామకృష్ణ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇల్లందు సిఐ సస్పెన్షన్ ను వెంటనే ఎత్తివేయాలి



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 27 (మహా):** భర్త చేతిలో మోసపోయిన ఒక ఆడబిడ్డకు న్యాయం చేయాలని భావించి, తన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భర్త బంధువులను కౌన్సిలింగ్ కు పిలిస్తే కౌన్సిలింగ్ కు వచ్చిన వారిపట్ల దురుసుగా ప్రవర్తించారని ఎటువంటి ఆధారాలు లేకుండా, ఏ చిన్న ఆరోపణలు లేకుండా నిజాయితీ గల ఇల్లందు సీఐని సస్పెండ్ చేయడం చాలా దారుణం అని ఆదివాసి ఐకాస రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ దొర స్పష్టం చేశారు. న్యాయం కోసం ఆశ్రయించే మహిళల పట్ల పోలీసు ఉన్నతాధికారులు మోసపోయిన మహిళకు న్యాయం చేయకపోగా ఒక మోసగాడిని సపోర్ట్ చేస్తున్న ఈ పోలీసు ఉన్నతాధికారులను ఏం చేయాలో ప్రభుత్వాలే నిర్ణయించాలన్నారు. సి.ఐ సత్యనారాయణ సస్పెన్షన్ పోలీస్ ఉన్నతాధికారుల తొందరపాటుగా తాము భావిస్తున్నామని, సి ఐ సత్యనారాయణ ఏజెన్సీ భద్రాద్రి జిల్లాలో కేసుల విషయంలో మహిళాల విషయంలో ఎక్కడ పొరపాటు చేసిన దాఖలాలు లేవని, ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్ గల వ్యక్తి అని,ఆయన మీద ఉన్న సస్పెన్షన్ ఎంత మాత్రం సరి కాదని వెంటనే సస్పెన్స్ ను వెంటనే ఎత్తివేసి అక్కడే పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేసారు.

# రఘునాథపాలెంలో పొలం బాట



**రమణ పాలెం, మహా:** పొలం బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మల్లేపల్లి, గడ్డికుంట తండా, బావోజితండ గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులు పరిశీలనలు చేపట్టారు. డివిజన్ ఇంజినీర్ (టెక్నికల్), భద్రతా అధికారి, రఘునాథపాలెం ఏడీఈ, మంచుకొండ ఏఈ, విద్యుత్ సిబ్బంది, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు గ్రామాల్లోని విద్యుత్ లైన్లు చూసి, ఐదు చోట్ల తక్కువ ఎత్తులో ఉన్న లైన్లు ప్రమాదకరంగా ఉన్నట్టు గుర్తించారు. వెంటనే వాటిని సరిచేయాలని అధికారులకు చెప్పారు. రైతులకు విద్యుత్ భద్రతపై సమాచారం ఇచ్చారు. సమస్యలు వస్తే 1912 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు విద్యుత్ భద్రతపై అవగాహన కలిగింది.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్స్

# అమలు చేయాల్సిందే



**ఖమ్మం, మహా:** బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాకే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపించాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కామారెడ్డి బహిరంగ సభలో,ఎన్నికల ప్రచారంలో,మేనిఫెస్టోలో బీసీలకిచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికలు,విద్యా, ఉద్యోగ రంగాలలో 42% రిజర్వేషన్స్ అమలు చేయాల్సిందేనని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు. ఇందుకోసం బాధ్యతగల ప్రతిపక్షంగా తమ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని, కాంగ్రెస్ పాలకులు,నాయకత్వంతో మరింత వత్తిడి పెంచుతూనే ఉంటుందన్నారు.ఎంపీ వద్దిరాజు శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, సీనియర్ నాయకులు చిరుమళ్ల రాకేష్, ఉపేంద్రాచారి,కోతి కిశోర్ గౌడ్ లతో కలిసి శుక్రవారం హైదరాబాద్ తెలంగాణ భవన్ లో విలేకరులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కాంగ్రెస్ పాలనలో బీసీలకు అన్ని రంగాలలో తీరని అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు మంత్రిమండలిలో కేవలం మూడంటే మూడు పదవులు మాత్రమే ఇవ్వడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు.మున్నూరుకాపు,యాదవ, ముస్లిం, లంబాడీ కుర్మ,చాకలి కులాల వారికి మంత్రివర్గంలో చోటివ్వకపోవడం బాధాకరమని ఎంపీ రవిచంద్ర అన్నారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తన హయాంలో బీసీలకు సముచిత ప్రాధాన్యతనిచ్చి గౌరవించారని చెప్పారు.అసెంబ్లీ స్పీకర్ గా మధుసూదనాచారి, శాసనమండలి ఛైర్మన్ గా స్వామిగౌడ్, మంత్రులుగా ఈటల రాజేందర్,గంగుల కమలాకర్,జోగు రామన్న,తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, పద్మారావు గౌడ్,తనతో పాటు కేశవరావు,డీ.శ్రీనివాస్,బండా ప్రకాష్ ముదిరాజ్ లను రాజ్యసభకు పంపి గౌరవించారని పేర్కొన్నారు. హైదరాబాద్ మహానగర మేయర్లుగా బొంతు రాంమోహన్, విజయలక్ష్మీ తదితరులకు పదవులిచ్చారని ఎంపీ వద్దిరాజు వివరించారు.కేసీఆర్ సుపరిపాలనకు పూర్తి భిన్నంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని,కులగణన సందర్భంగా కూడా బీసీల జనాభాను తక్కువ చేసి చూపారని గుర్తు చేశారు.తమిళనాడు తరహాలో బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు జరిపించాలని, ఇందుకోసం కాంగ్రెస్ పాలకులు కేంద్ర ప్రభుత్వంపై మరింత వత్తిడి పెంచాలని ఎంపీ రవిచంద్ర డిమాండ్ చేశారు.స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా, ఉద్యోగ రంగాలలో 42% రిజర్వేషన్స్ సాధించుకునేందుకు ఇదే సరైన సమయమని, ఇందుకు బీసీ కులాల వారందరం మరింత ఐక్యతతో పోరాడుదామని ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు.బీసీలకు 42% రిజర్వేషన్స్ సాధనకు ప్రధాని నరేంద్రమోడీ వద్దకు వెంటనే అఖిలపక్షాన్ని తీసుకువెళ్లి పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టేలా చిత్తశుద్ధితో కృషి చేయాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన డిమాండ్ చేశారు.బీసీలకు 42% రిజర్వేషన్స్ కోసం యుపీఏ పక్షాలతో కూడి కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీవ్రతరం చేయాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిపై, కాంగ్రెస్ నాయకత్వంపై ఉందన్నారు.పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు బీసీల పక్షాన బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతునిస్తుందని ఎంపీ వద్దిరాజు హామీనిచ్చారు.

# ప్రకృతి వ్యవసాయం వల్ల అనేక లాభాలు ఉన్నాయి: అగ్రికల్చర్ ఏఓ





**కూసుమంచి, జూన్ 27, మహా:** కూసుమంచి మండలంలోని కొత్తూరు గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కూసుమంచి మండలం అగ్రికల్చర్ అధికారి రామడుగు వాణి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల అనేక లాభాలు ఉన్నాయని, భూమి యొక్క జీవశక్తి పెరుగుతుందని, భూమి నాణ్యత మెరుగుపడుతుందనితద్వారా నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం మెరుగుపడుతుందని, నాణ్యమైన కలుషితం కాని ఆహారం లభిస్తుందని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయంలో జీవన ఎరువులు, గోమూత్రం, వేప సంబంధిత కషాయాలు, వర్మీ కంపోస్ట్, పుల్లటి మజ్జిగ వంటివి ఉపయోగించాలని తెలియజేశారు. అనంతరం అధిక యూరియా వాడకం వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. నానో యూరియా వాడకం మరియు భాస్వరం కరిగించే బ్యాక్టీరియా గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సౌమ్య , సాయిరాం మరియు రైతులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్-11 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం,మహా:** బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్-11 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అధికారులకు ఆదేశించారు. ఆపరేషన్ ముస్కాన్-11 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వివిధ శాఖల సంబంధిత అధికారులతో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తప్పిపోయిన పిల్లలను గుర్తించి, వారిని రక్షించి, పునరావాసం కల్పించి, సమస్యను పరిష్కరించడం వంటి లక్ష్యంతో కలిగిని ఈ కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పరిశ్రమలు, వ్యాపార సముదాయాల్లో ఈ ప్రత్యేక బృందాలు దాడులు నిర్వహించాలని, పిల్లలను పనిలో పెట్టుకునే యజమానులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇందుకోసం ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బృందాలు పట్టుబడిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించాలని, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ అందించి, అనాథలుగా ఉంటే వారిని కేర్‌హోమ్‌కు తరలించే ప్రక్రియను దృష్టి పెట్టాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే వెంటనే 100 లేదా 1098కు డయల్ చేయాలని, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ కోరారు. ఆపరేషన్ ముస్కాన్ ప్రతి ఏటా జూలై 1 నుంచి 31వ తేదీ వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ప్రత్యేక తనిఖీలు నిర్వహించి బాల కార్మికులను గుర్తించడం జరుగుతుం దన్నారు. అందుకు అవసరమైన ప్రణాళికను ఇప్పటికే సిద్ధం చేశారని తెలిపారు. పిల్లలతో పనిచేసే అవకాశాలు ఉన్న పలు పరిశ్రమలు, హోటల్స్, వ్యాపార సముదాయాలు, గోదాములు, గోదాములు, మెకానిక్ షాపులు తదితర ప్రాంతాల్లో వ్యూహాత్మక తనిఖీలు నిర్వహించాలని సూచించారు.ఆపరేషన్ ముస్కాన్-10లో భాగంగా గతేడాది 79 మందికి వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ ఏడాది అపరేషన్ స్మైల్ - 11 కార్యక్రమం ద్వారా 53 వెట్టి చాకిరీ నుండి రక్షించి 44 మంది బాలలను తల్లిదండ్రులు అప్పగించినట్లు తెలిపారు. మరో 9 మందిని రెస్క్యూ హోమ్ తరలించినట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ లా%&ఆర్డర్ ప్రసాద్ రావు, సత్యనారాయణ, విజయ భస్కర్ రెడ్డి, (డిప్యూటీ కమిషనర్ ,కార్మిక శాఖ) టి. విష్ణు వందన (డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్) డాక్టర్ చందన (నోడల్ ఆఫీసర్ హెల్త్ డిపార్ట్‌మెంట్)అనిత (చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు) ఇన్స్‌పెక్టర్ స్వామి పాల్గొన్నారు.

# అర్హులైన వారికి ఇళ్లు ఇవ్వాలి



**వైరా, మహా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని అనేక మంది నిరుపేదులు గతకాలంలోనే దరఖాస్తు చేసినప్పటికీ, ఇంతవరకు తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదని వాపోతున్నారు. తాము అన్ని అర్హతలు కలిగినవారమేనని, అయినప్పటికీ ఇళు ఇవ్వకుండా అన్యాయం జరుగుతుందని ఆరోపిస్తూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట భారీగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "అర్హతలున్న మాకు ఇళ్లు ఇవ్వకుండా, మధ్యవర్తుల మాధ్యమంగా అక్రమాలు జరుగుతున్నాయి. ఇప్పటికే అనేకసార్లు దరఖాస్తులు ఇచ్చాం. కానీ వాటిని పరిగణలోకి తీసుకోవడం లేదు. అర్హుల్ని విస్మరిస్తూ, సంబంధాలు ఉన్నవారికి ఇళ్లు కేటాయించడమే న్యాయమా?" అని ప్రశ్నించారు. నిజమైన అర్హులకే ఇళ్లు మంజూరు చేయాలని, అక్రమాలకు పాల్పడుతున్న మధ్యవర్తులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇళ్ల కేటాయింపుల్లో పారదర్శకత ఉండాలని, ప్రతి దరఖాస్తును సమీక్షించి న్యాయంగా అర్హతను నిర్ణయించాలని సూచించారు. ఆందోళన అనంతరం, ప్రతినిధుల బృందం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి తమ సమస్యలను వివరిస్తూ వినతిపత్రం సమర్పించింది. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికార యంత్రాంగం మౌనంగా ఉండకుండా స్పందించి ప్రజల న్యాయహక్కులను కాపాడాలని వారు స్పష్టం చేశారు. కమిషనర్ దరఖాస్తులన్నీ పరిశీలనలో ఉన్నాయని, అర్హులైనవారికి తప్పకుండా ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

# మెరుగైన వైద్య సేవల బాటలో మరో అడుగు

**మధిర, మహా:** మధిర నియోజకవర్గానికి మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్థానికంగా నిర్మాణంలో ఉన్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రికి అదనంగా రూ.4.02 కోట్లు మంజూరైంది. మౌలిక వసతుల విస్తరణ, అవసరమైన సివిల్ పనుల కోసం ఈ నిధులు విడుదలవడం స్థానిక ప్రజల్లో ఆశావహ స్పందనను కలిగించింది. 2021లో గత ప్రభుత్వం చేపట్టిన ఈ ఆసుపత్రి నిర్మాణం మొదటి నుంచీ నత్తనడకన సాగింది. రూ.34 కోట్ల అంచనాతో వైద్య ఆరోగ్య శాఖ ఈ నిర్మాణాన్ని ప్రారంభించినప్పటికీ, పనుల నాణ్యతపై అనేక ప్రశ్నలు ఎదురయ్యాయి. ముఖ్యంగా, ఈ భవనం వంద పడకల ఆసుపత్రిగా ఉపయోగపడాలన్న లక్ష్యానికి అనుగుణంగా మౌలిక వసతులు సిద్ధం కాలేకపోయాయి. గత పాలకులు ఎన్నికల వేళ హడావుడిగా పనులు పూర్తిచేయాలన్న తత్వంతో, ప్రజా అవసరాలకన్నా రాజకీయ లబ్ధికే పెద్దపీట వేశారు. ఫలితంగా భవనం నిర్మాణంలో అనేక లోపాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలో రాజకీయ పాలన మారిన తరువాత, ప్రజా ప్రభుత్వంలో భాగంగా మధిరకు ప్రాధాన్యత పెరిగింది. డిప్యూటీ ముఖ్యమంత్రి హోదాలో మధిర శాసనసభ్యుడు మల్లు భట్టి విక్రమార్క నియమితులవడంతో నియోజకవర్గ అభివృద్ధికి కొత్త ఊపొచ్చింది. ప్రభుత్వ మారిన కొద్ది రోజులకే, ప్రజా అవసరాలపై దృష్టి సారించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఆసుపత్రి భవనాన్ని అధికారులతో కలిసి పర్యవేక్షించారు. నిర్మాణ నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇకపై మధిర సివిల్ ఆసుపత్రి 'వైద్య విధాన పరిషత్' ఆధ్వర్యంలో పూర్తి స్థాయి వంద పడకల ఆసుపత్రిగా మారనుంది. మరింత ఆధునీకృత మౌలిక వసతులతో, సమర్థవంతమైన వైద్యసేవలతో ఆసుపత్రి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానున్నట్లు అధికారవర్గాలు స్పష్టం చేశాయి.

# ప్రత్యామ్నాయ విద్యుత్‌కు ఇంటర్ లింక్ లైన్‌లు



**ఖమ్మం,మహా:** వినియోగదారులకు నిరంతరంగా, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఖమ్మం సర్కిల్‌లో ఇంటర్ లింక్ లైన్‌ల ఏర్పాటు చేస్తున్నట్లు సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీనివాసాచారి తెలిపారు. ఇప్పటికే సర్కిల్ పరిధిలో ఉన్న 125 విద్యుత్ ఉప కేంద్రాల్లో 36 ఇంటర్ లింక్ లైన్లు ఏర్పాటు చేశామని, ఇంకా 14 కేంద్రాల్లో పనులు జరుగుతున్నాయని చెప్పారు. అదనంగా మరో 5 లైన్లను గుర్తించి, వాటిలో కూడా త్వరలో ఏర్పాట్లు చేస్తామని వివరించారు. ఈ వ్యవస్థ వల్ల ఏదైనా లైన్‌లో లేదా ఉప కేంద్రంలో విద్యుత్ అంతరాయం వచ్చినా, పక్కనున్న మరో లైన్ లేదా కేంద్రం నుంచి ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా చేయడం సులభమవుతుంది. దీని ద్వారా విద్యుత్ నిలిపివేతలు లేకుండా వినియోగదారులకు ఎప్పటికప్పుడు విద్యుత్ అందించే అవకాశం కలుగుతుంది. అదే విధంగా పదకొండు వేల్ట్ లైన్లను కూడా అనుసంధానించే పనుల్లో ఉన్నామని, అవసరమైన చోట్ల ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. వినియోగదారులకు మెరుగైన సేవల కోసం ఈ చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

# ఖమ్మంలో 28న పి.వై.ఎల్ జిల్లా జనరల్ కౌన్సిల్

**ఖమ్మం సిటీ, మహా:** ప్రగతిశీల యువజన సంఘం (పీ.వై.ఎల్) ఖమ్మం జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 28న ఖమ్మం నగరంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనుంది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు జిక్కుల భరత్ మాట్లాడుతూ ప్రభుత్వాలు అధికారంలోకి రాకముందు ఇచ్చిన ఉద్యోగ హామీలు మర్చిపోయాయని విమర్శించారు. కేంద్రం, రాష్ట్రం రెండూ ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగులను నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చినా అమలు జరగలేదని తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్స్ వాడకం పెరుగుతోందని, యువత చెడు అలవాట్లలోకి వెళ్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా జనరల్ కౌన్సిల్‌లో నిరుద్యోగ సమస్యపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. ఈ సమావేశాన్ని యువత పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్, నగర అధ్యక్ష కార్యదర్శులు రమేష్, ధరణ్, అశోక్, రవీందర్, నాయకులు చందు, శివలాల్ పాల్గొన్నారు.



FOLLOW: @ANNTELUGU
28-6-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# ఇల్లు మంజూరు చేయలేదని మహిళ ఆత్మహత్యాయత్నం



**వైరా, మహా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు గ్రామంలో శుక్రవారం ఉదయం హృదయవిదారక సంఘటన చోటుచేసుకుంది. గత 20 ఏళ్లుగా అద్దె ఇంట్లో నివసిస్తూ ప్రభుత్వం అందించే ఇండిరమ్మ ఇల్లు కోసం నిరీక్షిస్తున్న కొనకల్ల ఉషారాణి అనే మహిళ న్యాయం జరగకపోవడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు "నీకు ఇండిరమ్మ ఇల్లు ఎలా వస్తుంది?" అంటూ ధిక్కరించి దూషించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న మాసకాలయిన జ్వరమూయి, బీపీ మాత్రలను ఒకేసారి మింగేసింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, స్థానికులు వెంటనే స్పందించి ఆమెను వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉషారాణి అనంతరం మీడియాతో మాట్లాడుతూ %-% "నన్ను అర్హురాలిని అని గుర్తించకపోవడమే కాక, నాయకుల మాటలతో దౌర్జన్యంగా మాట్లాడారు. గత రెండు దశాబ్దాలుగా అద్దె ఇంట్లో జీవిస్తున్న నాకు ఇల్లు ఇవ్వకపోవడం అన్యాయమే" అని విలపించింది. గండగలపాడు గ్రామానికి ఇండిరమ్మ ఇళ్ల కేటాయింపులో అసమతుల్యతలు, రాజకీయ మలినాల ఆరోపణలు తెరమీదకు వచ్చాయి. గ్రామానికి మొత్తం 64 మంది అర్హులు ఉన్నప్పటికీ, స్థానిక కమిటీ కేవలం 30 మందినే ఎంపిక చేసి అధికారులకు జాబితా పంపింది. ఆ జాబితాలో ఉన్న 30 మందిలోనూ కేవలం 20 మందికే ఇండిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు సమాచారం. దీంతో వాస్తవంగా అర్హులైన అనేకమంది నిరుపేదలు వెనక్కి నెట్టి పెట్టబడ్డారు. ఈ నేపథ్యంలో గండగలపాడు గ్రామస్థులు శుక్రవారం వైరా మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. "ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు కొందరి చేతిలో ఒత్తిడులకు లోనవుతున్నాయి. అసలైన అర్హులకు మంజూరు కాక, రాజకీయంగా ప్రభావితులే లబ్ధిదారులవుతున్నారు" అంటూ మండిపడ్డారు. తమ సమస్యను వివరించేందుకు గ్రామస్తులు వైరా మున్సిపాలిటీ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, జాబితా ప్రక్రియ పునఃపరిశీలించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇకపై ఇల్లు అవసరమైనవారికే రావాలన్నారు. ఒక మహిళ ప్రాణాలతో చెలగాటం ఆటలాడే పరిస్థితి దాపురించిందంటే, వ్యవస్థల వైఫల్యం ఏ స్థాయిలో ఉందో తెలుస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అధికారులు స్పందించి వెంటనే విచారణ ప్రారంభించి బాధితురాలికి న్యాయం చేయాలని, రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా అర్హతను ప్రమాణంగా తీసుకుని ఇండిరమ్మ ఇళ్లను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాజకీయాలకు బలి కాకుండా చూసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం పెరిగిన నేపథ్యంలో... వైరాలో ఈ సంఘటన కలకలం రేపుతోంది.

## సత్తుపల్లి నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్ సేవ



**సత్తుపల్లి, మహా:** సత్తుపల్లి డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్ సేవను ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ యూ. రాజ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం అశ్వారావుపేట బస్టాండ్‌లో ఈ బస్ సర్వీసు కోసం కరపత్రాన్ని విడుదల చేశారు. జూలై 8 సాయంత్రం 7 గంటలకు సత్తుపల్లి డిపో నుంచి బస్ బయలుదేరుతుంది. మార్గమధ్యంలో కానిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శించుకుని, జూలై 10 పౌర్ణమి నాటికి అరుణాచలానికి చేరుకుంటుంది. అక్కడ గిరి ప్రదక్షిణ అనంతరం తిరిగి సత్తుపల్లికి బస్ బయలుదేరుతుంది. ఈ బస్ సూపర్ లగ్జరీగా (2o2 పుష్ బ్యాక్ సీట్లు) అందుబాటులో ఉంటుంది. పెద్దలకు రూ.5000, పిల్లలకు రూ.2510 చార్జీగా నిర్ణయించారు. టికెట్లు ఆన్‌లైన్‌లో tgsrtcbus.in ద్వారా 99599 సర్వీస్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. ఇంకా వివరాలకు 9866619189 లేదా 9542698518 నెంబర్లను సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు, అశ్వారావుపేట కంట్రోలర్ ఆర్.వి.రావు, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కేటాయించాలి



**ఖమ్మం,మహా:** పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక కేటాయించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్, శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక సరఫరాపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక సమస్య రాకుండా మండలాల వారీగా ఎక్కడి నుంచి ఇసుక తీసుకోవాలో ప్రభుత్వం నిర్ణయించి ఇసుక రీచ్ లను కేటాయించిందని అన్నారు. మండలాల్లో ఎక్కడైనా ఇసుక తరలించే పాయింట్ అందుబాటులో ఉంటే ఆ వివరాలను తహసిల్దార్ అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రతి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు హౌజింగ్ శాఖ ఏఇ నుంచి ఏ సమయంలో ఎన్ని ట్రాక్టర్ల ఇసుక అవసరం ఉంటుందో వివరాలతో లేఖ అందించాలని అన్నారు. ఏఇ అందించిన లేఖ ఆధారంగా తహసిల్దార్ కూపన్ జారీ చేస్తారని, కూపన్ తో 3 రోజులలో సంబంధిత మండలానికి కేటాయించిన ఇసుక రీచ్ నుంచి ఇసుక తెచ్చుకోవాల్సి ఉంటుందని, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో అవసరమైన వాహనాలు అందుబాటులో ఉంటాయని, స్వశక్తి మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇసుక రీచ్ లు నిర్వహిస్తున్నామని, ప్రతి ట్రాక్టర్ లోడ్ ఇసుకకు 200 రూపాయలు తహసిల్దార్ కార్యాలయం వద్ద చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. 200 రూపాయలలో సగం వంద రూపాయలు మహిళా సంఘాలకు, 50 రూపాయలు స్థానిక గ్రామ పంచాయతీలకు, 50 రూపాయలు గ్రామీణ అభివృద్ధి శాఖకు వెళ్తాయని అన్నారు. ఉదయం 6.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు మాత్రమే ఇసుక రీచ్ ల నుండి ఇసుక తరలించాల్సి ఉంటుందని అన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇసుక కేటాయింపుపై అధికారులకు ఉన్న పలు సందేహాలను అదనపు కలెక్టర్ నివృత్తి చేశారు. విపత్తు నిర్వహణ కోసం అవసరమైన పరికరాలు అందుబాటులో పెట్టెందుకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ అన్నారు. టార్చ్ లైట్, లైఫ్ జాకెట్, స్పీకర్ మైక్ సెట్స్, బోట్లు, జిప్ కవర్, గజ ఈతగాళ్ళకు ఎంత వరకు అందుబాటులో ఉన్నాయో పరిశీలించాలని అన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి మండల స్థాయిలో విపత్తు నిర్వహణ కమిటీ సమావేశాలు నిర్వహించాలని అన్నారు. ఆపద మిత్ర, గజ ఈతగాళ్ళతో రెగ్యులర్ గా టచ్ లో ఉండాలని తెలిపారు. ఖమ్మం జిల్లాలో 24 సభ్యులతో కూడిన ఎన్.డి.ఆర్.ఎఫ్, 24 సభ్యులతో కూడిన ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను స్టేషన్ చేసి పెట్టామని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్డీవో సన్యాసయ్య, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, జిల్లా మైనింగ్ అధికారి సాయినాథ్, ఆర్డీవోలు నరసింహా రావు, ఎల్. రాజేందర్,డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, ఎంపీఓ లు, హౌజింగ్ ఏఇ లు, అధికారులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలకి చెక్

**ఖమ్మం, మహా:** రైతు చేతుల్లోకి చేరే విత్తనం... పంటల కన్నా ముందుగా ఆశలు నాటుతుంది. ఆ ఆశలు నకిలీ విత్తనాల వలన చిగురించక ముందే మురిజేతలు కావడం, తెల్లదోసిల్లా మిగిలిపోయిన పొలాలు చూసి రైతు గుండె కదలికలు ఆగిపోతున్న దుస్థితి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం కొత్త చట్టానికి శ్రీకారం చుట్టింది. నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపుతూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు, మార్కెట్ పారదర్శకతను తీసుకురావడానికి సమగ్రంగా, శాస్త్రీయంగా, ప్రజల ఆలోచనలు చేర్చి రూపొందిస్తున్న ఈ విత్తన చట్టం ఒక రైతు అధికార పత్రంగా నిలవనుంది. తెలంగాణ వ్యవసాయ రంగంలో నూతన శకం ఆరంభం కావడానికి రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే వరంగల్, హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్, గద్వాల్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో రైతులతో ప్రత్యక్షంగా సమావేశమై, వారి వేదనను, భవిష్యత్తుపై ఆశలను వినిన ప్రభుత్వం, ఆ అభిప్రాయాలను ఆధారంగా చేసుకుని సమగ్ర విత్తన చట్టం ముసాయిదా సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. ఈ చట్టం రూపకల్పనలో రైతుల భావాలు, విత్తన కంపెనీల సూచనలు, వ్యవసాయ శాస్త్రవేత్తల పరిశీలనతోపాటు, మార్కెట్ పరిశ్రమలోని న్యాయ నిబద్ధతలన్నింటినీ సమన్వయపర్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల హర్యానాలోని విత్తన చట్ట అమలుపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేకంగా ఒక అధ్యయన కమిటీ పంపించారు. అక్కడి విధానాల్లో రైతుల భాగస్వామ్యం ఎలా ఉంది, నకిలీ విత్తనాలపై వారు ఎలా స్పందిస్తున్నారు, ఆ చట్టం వల్ల భద్రత ఎలా కలుగుతోంది అన్న విషయాలన్నింటినీ సమగ్రంగా అధ్యయనం చేసి, అన్వయించదగిన అంశాలను తెలంగాణకు అనుసరించే పనిలో కమిటీ బిజీగా ఉంది. ఈ క్రమంలోనే బషీర్ బాగ్‌లోని వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో ఇటీవల జరిగిన కీలక సమావేశంలో ముసాయిదా చర్చకు వచ్చినది. వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.గోపి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, సభ్యులు భూమి సునీల్, దొంతి నర్సింహారెడ్డి, ఎం.వి. నాగేశ్ కుమార్, శివ ప్రసాద్, జాయింట్ డైరెక్టర్ సుచరిత, డిప్యూటీ డైరెక్టర్ అనిత, రైతు కమిషన్ సభ్యులు గోవిందు, ఇతర అధికారులు పాల్గొన్నారు. చట్ట రూపకల్పన ఎలా ఉండాలి, పాయింట్ల వారీగా ఏమేం చేర్చాలన్న అంశాలపై విచక్షణతో చర్చ జరిగింది. ఈ చట్టం అమలులోకి వచ్చినపుడు విత్తనాల నాణ్యతపై స్పష్టమైన ప్రమాణాలు అమలవుతాయి. విత్తనాన్ని ఉత్పత్తి చేసే కంపెనీలకు పూర్వానుమతి తప్పనిసరిగా ఉండాలి. రైతులకు నష్టమొచ్చే విధంగా విత్తనాల సరఫరా జరిగితే, కంపెనీలపై నేర చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి కలుగుతుంది. అంతేకాదు, రైతు నష్టానికి పరిహారం పొందే హక్కు కూడా చట్టం ద్వారా నిర్ధారించబడుతుంది. తద్వారా న్యాయ పరిరక్షణ రైతు పక్షాన నిలబడుతుంది. మొత్తంగా ఈ చట్టం ద్వారా నకిలీ విత్తనాల విక్రయాన్ని పూర్తిగా అడ్డుకునే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. రైతులకు నమ్మకమైన విత్తనాల అందుబాటుతో పాటు పారదర్శక సరఫరా వ్యవస్థ ఏర్పడనుంది. కంపెనీలు తమ విధుల్ని నిర్వర్తించకపోతే వ్యవసాయ శాఖ నేరుగా జోక్యం చేసుకునే అధికారం కలిగి ఉంటుంది. పైగా రైతు శిక్షణ, అవగాహన కార్యక్రమాల ద్వారా విత్తన ఎంపిక విషయంలో సుస్థిర పరిజ్ఞానం కల్పించే లక్ష్యంతో రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యాచరణ రూపొందిస్తోంది. ఈ చట్టం కేవలం నియంత్రణకు మాత్రమే కాకుండా, రైతు నమ్మకాన్ని పునఃస్థాపించే పునాది కావాలనే లక్ష్యంతో ముందుకెళ్తోంది. రైతు చేతిలోకి వచ్చే విత్తనం, న్యాయబద్ధమైనదే అనే నమ్మకాన్ని చట్టబద్ధంగా నెలకొల్పే ప్రయత్నం ఇది. ఒక్కో విత్తనం ఒక్కో ఆశగా మారి, పంటలతో పాటు రైతు గుండె చప్పుడుని కూడా నిలబెట్టే చట్టంగా ఇది రూపుదిద్దుకుంటోంది.



# ఆదివాసులకు న్యాయం చేస్తున్నా

**భద్రాచలం, మహా:** జీవో నెంబర్ 49 రద్దు అంశంపై మంత్రి సీతక్కకు మావోయిస్టుల పేరిట వచ్చిన హెచ్చరిక లేఖపై ఆమె స్పష్టమైన స్పందన వ్యక్తం చేశారు. ఈ లేఖ నిజంగా మావోయిస్టు పార్టీ నుంచి వచ్చిందా, లేదో స్పష్టత లేదని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. అయినప్పటికీ, ఈ లేఖను ఆధారంగా చేసుకొని కొన్ని రాజకీయ పార్టీలు, పత్రికలు, మీడియా సంస్థలు అసత్య ప్రచారాలను నిర్వహిస్తున్నాయని మండిపడ్డారు. సమాజంలో ఒక మహిళపై అసభ్య పదజాలాన్ని వినియోగించడం బాధాకరమని, "ఒక మహిళను పట్టుకొని సిగ్గులేదా అని రాయడం ఏమంతా జర్నలిజం?" అంటూ ఆమె తీవ్రంగా విస్మయం వ్యక్తం చేశారు. తనను టార్గెట్ చేస్తూ ఎన్నికల నుంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇప్పుడు అదే శక్తులు కొత్త రూపంలో తనపై దాడికి తెగబడుతున్నాయని తెలిపారు. "75 ఏళ్లలో మొట్టమొదటిసారిగా ఒక కోయ మహిళకు జనరల్ పోర్ట్ ఫోలియో లభించడాన్ని బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోంది. అందుకే నన్ను లక్ష్యంగా తీసుకొని తప్పుడు ప్రచారాలు, వీడియోలు సృష్టిస్తున్నారు" అని ఆమె పేర్కొన్నారు. జీవో 49ను తాను స్వయంగా వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేసిన మంత్రి, గిరిజన సంక్షేమ మంత్రిగా రాజకీయ భేదాలు లేకుండా అన్ని పార్టీలకు చెందిన ఎస్టీ ఎమ్మెల్యేలతో సమావేశమై జీవోను రద్దు చేయాలని తీర్మానం చేసినట్లు వివరించారు. "ఏ హోదాలో ఉన్నా, ఎక్కడ ఉన్నా... నేనే ఒక అడవి బిడ్డ. నా జీవితం ఆదివాసుల అభివృద్ధికే అంకితం. వారిని దోచుకునే వ్యవస్థలకు, అధికారుల అహంకారానికి అడ్డుగావుతున్నా" అని పేర్కొన్నారు. కొంతమంది అధికారం మించిన అధికారులు ఆదివాసులపై దాడులకు దిగుతున్న ఘటనలు తన దృష్టికి రాగానే వెంటనే స్పందించి అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, పీసీసీఎఫ్ సువర్ణలతో మాట్లాడినట్లు వెల్లడించారు. "బీఆర్ఎస్ పాలనలో ఆదివాసుల గుడిసెలను కూల్చారు. మోసగాళ్ల ప్రేమ ఇప్పుడు మోసలి కన్నీటి రూపంలో ఒలకబోస్తోంది. చంటి పిల్లల తల్లులను జైళ్లకు పంపించారు. చెట్లకు కట్టేసి కొట్టారు. ఇప్పుడు వారే మానవత్వం గురించి మాట్లాడడం వినడానికి విడ్డూరంగా ఉంది" అంటూ సీతక్క ఘాటుగా స్పందించారు. జీవో 49ను రద్దు చేయాలని తాను గళమెత్తానని, రాజకీయ ప్రతిష్ఠతో ఆ జీవోను నిలిపివేయడం జరగలేదని విమర్శించారు. ఆదివాసుల పట్ల ఉన్న ప్రేమను రాజకీయ లబ్ధికోసం ఉపయోగించడాన్ని ఆమె తప్పుబట్టారు.

## నన్ను ఓడించేందుకు వంద కోట్లతో కుట్రలు

**ఎన్నికల సమయంలో నన్ను ఓడించేందుకు వంద కోట్ల రూపాయలతో కుట్రలు చేసినా... ములుగు ప్రజలు నన్ను విశ్వసించి రికార్డు మెజార్టీతో గెలిపించారు. అదే నాకు అసలైన శక్తి" అని అన్నారు. తనకు లభించిన మంత్రి పదవితో ఏజెన్సీ ప్రాంత ప్రజలకు, పేదల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.**

## మావోయిస్టులకు సూచన - నిజాలు మాత్రమే చెప్పండి

**మావోయిస్టుల పేరుతో వచ్చిన లేఖను పరోక్షంగా ఉద్దేశిస్తూ, "ఎవరు మాట్లాడినా... కనీసం నిజాలు మాట్లాడాలి. అర్థం లేని ఆరోపణలతో, అసత్య ప్రచారాలతో ఎవరికీ మేలు జరగదు" అంటూ హితవు పలికారు.**

# రేడియాలజీ లేకుండానే రిపోర్టు

**ఖమ్మం, మహా:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డయాగ్నస్టిక్, స్కానింగ్, రేడియాలజీ ల్యాబ్‌లలో సాగుతున్న రోగ నిర్ధారణ పద్ధతులు, అధికారుల నిర్లక్ష్యం, ప్రైవేటు ఆసుపత్రుల ఆధిపత్యం అన్నీ కలసి ప్రజారోగ్యం మీద విపరీతమైన ప్రభావాన్ని చూపిస్తున్నాయి. నిపుణులేమీ లేకుండా, సరైన పరికరాలేమీ లేకుండా, అనుభవం లేని సిబ్బందితో కేవలం లాభాల కోసం రోగుల జీవితాలను ముప్పులోకి నెట్టడం అత్యంత ప్రమాదకరమైన ప్రక్రియగా మారింది. ఆరోగ్యశాఖ మౌనంగా ఉండటం వల్ల ఈ వ్యవస్థ సమూలంగా చెల్లాచెదురైపోతుంది. ఇది ప్రస్తుత వ్యవస్థలో అత్యవసరంగా నిర్ధారణ, నియంత్రణ అవసరమయ్యే సమస్యగా గోచరిస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న 456 ప్రైవేటు డయాగ్నస్టిక్ సెంటర్లు, 177 స్కానింగ్ సెంటర్లు, 48 రేడియాలజీ ల్యాబ్‌లు, 8 టుడీ ఎకో ల్యాబ్‌లు, 160 గైనిక్ ల్యాబ్‌లు అన్నీ కలిపి వేలాది రోగులకు రోగ నిర్ధారణ సేవలు అందిస్తున్నా వాటి నాణ్యతపై ఎటువంటి గట్టి పర్యవేక్షణ కనబడడం లేదు. ల్యాబ్‌లు నడుస్తున్న తీరును పరిశీలిస్తే నిపుణుల సలహా లేకుండా పరీక్షలు నిర్వహించడం, ఫలితాలు ఇవ్వడం, పరీక్షలు చేసిన సిబ్బంది పేర్లతోనే రిపోర్టులు ఇచ్చేయడం వంటివి కనిపిస్తున్నాయి. ఇది కేవలం వైద్య నైతికతకే కాదు జాతీయ వైద్య మండలి నిబంధనలకు కూడా విరుద్ధం. ఈ సమస్యకు ప్రధాన కారణం - డయాగ్నస్టిక్ సెంటర్ల వెనక ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల ఓనర్ల మద్దతు. ఆయా ఆసుపత్రుల్లోని వైద్యులే స్వయంగా ల్యాబ్‌లు నెలకొల్పడం వల్ల వీటిపై ఏ అధికారుల చేత పట్టుబడడం లేదు. రోగులు చికిత్స కోసం వెళ్తే లెక్కకు మించి టెస్టుల జాబితా రాస్తారు. ఆ టెస్టుల కోసం వెళ్లిన ల్యాబ్‌లు అత్యధిక రుసుములు వసూలు చేస్తూ, నాణ్యతలేని ఫలితాలను ఇస్తున్నాయి. ఇదే విధంగా గర్భిణుల విషయంలో కూడా అంతే దురవస్థ. నెలకు కనీసం రెండుసార్లు స్కానింగ్ తప్పనిసరి కావడంతో గర్భిణులు ల్యాబ్‌ల వద్ద ఖర్చు కడతారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డయాగ్నస్టిక్ సదుపాయం ఉన్నప్పటికీ ప్రైవేటు వైద్యుల మాటలకు లోబడి వేల రూపాయలు ఖర్చుపెడుతున్నారు. అలాగే, ఇటీవల ఖమ్మం , వైరా, సత్తుపల్లి, మధిర, మణుగూరు, కొత్తగూడెం ప్రాంతాల్లో అనుమతుల్లేని ల్యాబ్‌లను అధికారుల సీజ్ చేశారు. కానీ, అదే సమయంలో అనుమతుల్లేని మరెన్నో ల్యాబ్‌లు పట్టించుకోకుండా వదిలేయడం వ్యవస్థపైనే నమ్మకాన్ని తగ్గిస్తోంది. అధునాతన పరికరాలు కొనుగోలు చేయడానికి ప్రైవేట్ సెంటర్లకు సామర్థ్యం ఉన్నప్పటికీ, అవి పెట్టకుండా పాత పరికరాలతోనే కొనసాగిస్తూ ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్నారు. దీనిపై జిల్లా వైద్య శాఖ అధికారుల వాదనలు సైతం బలహీనంగానే ఉన్నాయి. పరిమిత సిబ్బంది, విచారణలపై ప్రెజర్ ఉన్నందున పూర్తి స్థాయిలో తనిఖీలు చేయలేకపోతున్నామన్నదే వారి సమాధానం. కానీ ఇది ప్రజల ప్రాణాలతో చెలగాటం చేసే వ్యవస్థకు తేలికపాటి న్యాయం కాదని ప్రజా సంఘాలు తీవ్రంగా ప్రశ్నిస్తున్నాయి. రోగ నిర్ధారణలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం, నిపుణుల పర్యవేక్షణలో పరీక్షలు జరగడం అన్నీ ప్రాథమిక అవసరాలు. ఇవి లేకుండా లాభాపేక్షతో ప్రైవేటు డయాగ్నస్టిక్, స్కానింగ్ సెంటర్లు నడవడమే కాకుండా, వాటిపై అధికారుల మొగ్గు లేకపోవడం తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా మారుతోంది. దీనికి గట్టి సమీక్ష, పారదర్శక తనిఖీలు, కఠిన చర్యలు తప్పనిసరిగా అవసరం. లేకపోతే ప్రజల ప్రాణాల మీద ప్రయోగాలు కొనసాగుతూనే ఉంటాయి.

